క్లుప్తంగా

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం



జగ్గంపేటలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రనాయుడిని సత్కరించిన అధ్యాపకులు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రనాయుడు ఉద్యోగ విరమణ కార్యక్రమం కళాశాల ఆవరణలో శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ చంద్రనాయుడు దంపతులను కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఒమ్మి రఘురాం ఆధ్వర్యంలో సభ్యులు, ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం మాట్లాడుతూ విధి నిర్వహణలో మెరుగైన సేవలు అందించిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కళాశాల అభివృద్ధికి, కొత్తగా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు తేవడంలోనూ, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రిన్సిపాల్ చంద్రనాయుడు చేసిన కృషి మరవలేనిదని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కొత్త వెంకటేశ్వరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పాలకుర్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు పరిశుభ్రతపై అవగాహన



సుబ్బయ్యమ్మపేట అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీఓ పూర్ణిమ

గండేపల్లి: కౌమార దశలో బాలికలకు రుతుక్రమంలో పాటించవలిసిన పరిశుభ్రత, తీసుకోవలసిన జాగ్రత్తలపై శుక్రవారం ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. గండేపల్లి మండలంలోని మల్లేపల్లి, సుబ్బయ్యమ్మపేట, జగ్గంపేట మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ మాట్లాడుతూ ప్రతినెలా ఎల్‌ఎంపీ నుంచి 28 రోజుల్లో రుతుక్రమం వస్తుందని, అలా రాకపోతే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. బాలికల్లో పౌష్టికాహార లోపం లేకుండా మంచి ఆహారం, ఆకుకూరలు, పండ్లు, పాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాల ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్ వాడీ సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లోవ కుమార్

శంఖవరం: కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రమైన శంఖవరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన కురందాసు లోవకుమార్, అతని భార్యకు మధ్య గత కొంతకాలంగా కుటుంబ కలహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు, గ్రామ పెద్దల సమక్షంలో పలు మార్లు పంచాయితీ జరిగినా వారి మధ్య వివాదం సర్దుమనగలేదు. ఈ ఘర్షణల కారణంగా లోవకుమార్ భార్య కావేరి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన లోవకుమార్ ఎలుకుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. బంధువులు స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై అన్నవరం ఎస్సై ఐ.కిశోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు



సామర్లకోటలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం

సామర్లకోట: స్థానిక మారుతినగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను పూర్తి చేశారు. శనివారం తెల్లవారు జామున స్వామి వారికి ప్రత్యేక పూజలు, అనంతరం భక్తులచే సామూహిక వ్రతాలు, సాయంత్రం హోమం, రాత్రి స్వామి వారికి పుష్పాలు, తమలపాకులచే అభిషేకాలు నిర్వహిస్తారు. ఆలయ ధర్మకర్త చింతామణి పంతంజలి శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయి. అదే విధంగా నియోజకవర్గ పరిధిలోని అన్ని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఆయా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

హరితవనం.. ఆహ్లాదకరం

- తుని పట్టణంలో జోరుగా మొక్కల పెంపకం
- హరిత వికాస్ ఫౌండేషన్ భాగస్వామ్యం
- ప్రజలను ఆర్షిస్తున్న మొక్కలు



తుని జీఎన్‌టీ రోడ్డు సెంట్రల్ డివైడర్‌లో వేసిన మొక్కలు

తుని: పట్టణ ప్రజలు ఏళ్లతరబడి ఎదురు చూస్తున్న హరిత ప్రాజెక్టు ఎట్టకేలకు కార్యరూపం దాల్చింది. పట్టణంలో అందమైన మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఈ ప్రాజెక్టులో స్వచ్ఛంద సంస్థలు, ఫౌండేషన్లు, డెక్కన్ కెమికల్స్ సంస్థలు భాగస్వామ్యులు అయ్యారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రోత్సాహంతో ట్రీ చాలెంజ్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు.

పురపాలక సంఘం పరిధిలోని 30 వార్డుల్లో నీడ, పూలు, ఫలాలు, ఔషధ గుణాలు కలిగిన మొక్కలను పెంచాలని హరిత వికాస్ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నారు. దీనిలో భాగంగా రెండేళ్ల వ్యవధిలో 17,000 మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకూ 16,500 మొక్కలను నాటారు. ఇందుకు అవసరమైన మొక్కలను ఉత్పత్తి చేసేందుకు బొద్దవరం, ఎస్.సూరవరంలో సోషల్ ఫారెస్టు ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి మొక్కలను తీసుకువచ్చి ప్రాజెక్టులో పొందుపరిచిన ప్రాంతాల్లో వేయడంతో పాటు సస్యరక్షణ బాధ్యతను తీసుకున్నారు.

కాలుష్యానికి చెక్

గత ప్రభుత్వాల హయాంలో పురపాలక సంఘం పరిధిలో రూ.లక్షలు వెచ్చించి మొక్కలు నాటారు. తర్వాత వాటి సంరక్షణను ఎవరూ పట్టించుకోలేదు. ఇందుకు భిన్నంగా ఈసారి హరిత వికాస్ ఫౌండేషన్‌తో మున్సిపాలిటీ ఒప్పందం చేసుకుంది. మొక్కలు ఎంపిక, నాటడం, సస్య రక్షణ వరకూ బాధ్యతలను అప్పగించారు. ఇందుకు అవసరమైన వ్యయాన్ని పురపాలక సంఘం ద్వారా కల్పిస్తారు. పట్టణంలోని వీధులు, పాఠశాలలు, కళాశాలలు, పార్కులు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, ఆసుపత్రులు, గృహాలు తదితర ప్రాంతాల్లో మొక్కలను వేసి పెంచుతున్నారు. తుని జీఎన్‌టీ రోడ్డులో 2.50 కిలోమీటర్ల మేర మొక్కల పెంపకానికి డెక్కన్ కెమికల్స్ కంపెనీ నిధులు సమకూర్చింది. నిర్వహణ బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు.

నాటిన మొక్కలు ఇవే

నీడను ఇచ్చే రకాల్లో పొన్న, రావి, బొగడ, కదంబ, బాదం, గానుగ, వేప, తెల్లమద్ది, నెమలి, మేడి, జమ్మి, నేరేడు, ఇరుగుడు, మోదుగ, చంద్ర అంకుడు, మారేడు, జువ్వి, తురక వేప, కోనాకార్పస్, స్వేతోడియా రకాలు ఉన్నాయి. పూలనిచ్చే రకాల్లో సంపెంగ, సింహాచలం సంపెంగ, పారిజాతం, దేవకాంచన, రేల, నంది వర్ధనం, గన్నేరు, కాడమల్లే రకాలు ఉన్నాయి. పండ్లు ఇచ్చే రకాల్లో సీతాఫలం, జామ, నేరేడు, రామఫలం, సగాన్ (ఇండియన్ చెర్రీ) దానిమ్మ, వెలగ, ఉసరి ఉన్నాయి. వీటిని ఆయా ప్రాంతాలకు అనుగణంగా వేస్తున్నామని హరిత వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అధ్యక్షుడు దాలినాయుడు తెలిపారు.

గ్రీన్ తుని ప్రాజెక్టు వివరాలు

తుని మున్సిపాలిటీ విస్తీర్ణం:	7.02 కిలోమీటర్లు
జనాభా:	53,506
వార్డులు:	30
హౌస్ హోల్డర్లు:	14,233
ఇతరులు:	1386
వీధుల సంఖ్య:	280
పాఠశాలలు, కళాశాలల సంఖ్య:	52
మొత్తం విద్యార్థులు :	12,825
మొత్తం మొక్కల సంఖ్య:	17,000

పట్టణాన్ని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతాం



పట్టణాన్ని గ్రీన్ సిటీగా మార్చడానికి హరిత వికాస్ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నాం. మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు రెండేళ్లలో 17,000 మొక్కలను పట్టణంలో నాటాం. మొక్కలు నాటిన నుంచి ఎదిగే వరకు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటున్నాం. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే తుని పట్టణం గ్రీన్ సిటీగా మారుతుంది. మొక్కల నిర్వహణ బాధ్యతను డెక్కన్ కెమికల్స్ యాజమాన్యం తీసుకుంది.

– ఏలూరి సుధారాణి, చైర్మన్, తుని

పచ్చదనంతో కాలుష్య నియంత్రణ



కాలుష్యం నుంచి రక్షణ పొందడానికి మొక్కల పెంపకం ఒక్కటే మార్గం. విరివిగా మొక్కల పెంపకం చేపట్టి, వాటి సంరక్షణ బాధ్యతను ఫౌండేషన్ తీసుకుంటోంది. ఈ ప్రాజెక్టులో స్వచ్ఛంద సంస్థలు, వలంటరీ ఆర్గనైజేషన్, ఇతర సంస్థలను భాగస్వాములను చేస్తున్నాం.

– పి.దాలినాయుడు, హరిత వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



బిళ్లనందూరులో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కోటనందూరు: పల్లెల్లో పారిశుధ్యం మెరుగుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని పంచాయతీ విస్తరణాధికారి జి. అరుణ్‌కుమార్ తెలిపారు. డ్రై డే- ఫ్రై డేలో భాగంగా మండల వ్యాప్తంగా పల్లెల్లో శుక్రవారం శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఎక్కడికక్కడ పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. మురికి ప్రాంతాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. బిళ్లనందూరు, ఇండుగపల్లి గ్రామాల్లో నిర్వహించిన పారిశుధ్య పనులను ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సుధాకర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలంతా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. తాగునీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పంచాయతీ కుళాయిల నుంచి కలుషిత నీరు వస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే పంచాయతీ సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

గోకవరం: మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. గోకవరంతో పాటు పలు గ్రామాల ప్రజలు గత కొన్ని రోజులుగా తీవ్రమైన విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీంతో శుక్రవారం ఆయన విద్యుత్‌శాఖ ఏఈ అశోక్‌ను కలిసి సమస్యను వివరించారు. విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఏఈ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు



కండక్టర్ నారాయణను సన్మానిస్తున్న డిపో మేనేజర్ సత్యనారాయణ



జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న కమిషనర్ శివప్రసాద్

ఏలేశ్వరం: ప్రభుత్వ ఉద్యోగ్యులు తమ సేవల ద్వారా గుర్తింపు పొందాలని ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ సూచించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేసిన జీఎస్ నారాయణ ఉద్యోగ విరమణ చేయడంతో నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ నారాయణ తన సేవల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. ప్రతి ఉద్యోగి ఉత్తమ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో కార్యదర్శి త్రిమూర్తులు, అధ్యక్షుడు కేఎస్‌కే రావు, కెరవి, జి.అప్పలరాజు, బీసీసంఘం రాష్ట్ర కోశాధికారి భీమన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ సేవలు ప్రశంసనీయం

ఏలేశ్వరం: నగర పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా సీఎస్ఎస్‌వీఎస్ ప్రసాద్ అందించిన సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రసాద్ ఉద్యోగ విరమణ చేయడంతో శుక్రవారం ఆయనను సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ శివపసాద్ ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ దంపతులకు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు తమ సర్వీసులో నిజాయితీగా పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ప్రసాద్ తన సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, టీపీఓ జేడీ ఆనంద్‌కుమార్, ఏఈ అనూష సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రై డే..



యర్రవరం జంక్షన్ వద్ద నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

- నిప్పులు కురిపిస్తున్న భానుడు
- అల్లాడిపోతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా మారిన రహదారులు



రాచపల్లి అడ్డురోడ్డు వద్ద ఎండ నుంచి రక్షణకు ముసుగు ధరించిన యువతి

ఏలేశ్వరం: ఎండలు మండిపోతున్నాయి. మెట్ట ప్రాంతమైన ప్రత్తిపాడు నియోజకవర్గంలో బుధవారం భానుడు నిప్పులు కురిపించాడు. ఉదయం 9 గంటల నుంచే వడగాడ్పులు వీశాయి. వేసవి తాపానికి నియోజకవర్గవ్యాప్తంగా ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత, ఉక్కబోత రోజురోజుకూ పెరగడంతో ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. ఉదయం 11 గంటలకే వ్యాపారులు షాపులు మూసివేస్తున్నారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలకు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉండడంతో ప్రజలు ఇళ్ల వద్దనే ఉంటున్నారు. ఏలేశ్వరంలో ప్రధానరహదారులు జనసంచారం లేక వెలవెలబోయాయి. వాహనదారులు ఎండను తట్టుకొనేందుకు గొడుగులు, ముసుగులు ధరించారు. నైరుతి రుతుపవనాలు మరో నాలుగురోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని వాతావరణశాఖ ప్రకటించడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

తారెత్తించిన ఎండలు

ప్రత్తిపాడు రూరల్: మండలవ్యాప్తంగా శుక్రవారం ఎండలు తారెత్తించాయి. ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రత కొనసాగింది. సాయంత్రం ఆరు గంటలైనా ఎండల తీవ్రత ఎక్కడా తగ్గలేదు. ఆ తర్వాత ఒక్కసారిగా ఆకాశంలో మేఘాలు కమ్ముకుని వాతావరణం చల్లబడింది. భారీ ఉష్ణోగ్రత నమోదు కావడంతో పాటు తీవ్ర ఉక్కపోతకు ప్రజలు అల్లాడిపోయారు. ఫలితంగా అత్యవసర పనులు ఉంటే మినహా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఎక్కువగా శీతలపానీయాలను ఆశ్రయించారు. రోజురోజుకు ఎండల తీవ్రత పెరిగిపోవడంతో రుతుపవనాల రాక కోసం ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ల పంపిణీ

కొత్తపల్లి: అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ సెజ్ ప్రాంతంలో యువతకు కంప్యూటర్ కోర్సు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ, యువకులకు శుక్రవారం ఆ సంస్థ ప్రతినిధులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రతిభా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 31 మందికి ఫిల్మ్ డైరెక్టర్ ఉయ్యూరు విజయేంద్ర, లైఫ్ స్కిల్స్ ట్రైనర్ వాసంశెట్టి కిషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బెల్ట్ షాప్‌పై ఎస్ఈబీ దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని టి.రాయవరంలో బెల్ట్ షాప్‌పై శుక్రవారం స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్-ఎస్ఈబీ) సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పెదపాటి చిట్టిబాబును అదుపులోకి తీసుకుని అతని నుంచి ఎనిమిది 180 ఎంఎల్ పరిమాణం గల మద్యం సీసాలను, ఆరు బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సెబ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. అలాగే ఒమ్మంగిలో మొగిలి ధర్మరాజును అరెస్టు చేసి, అతని నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు సంఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక సెబ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు.

విద్యాబోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఈఓ రమేష్

అన్నవరం: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ ఆదేశించారు. అన్నవరంలో శుక్రవారం ఆయన శంఖవరం, రౌతులపూడి, కోటనందూరు మండలాల పరిధిలోని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కనీస అభ్యసన స్థాయిలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది పిల్లలను జాయిన్ చేయించాలన్నారు. స్కూళ్ల నిర్వహణ విషయంలోనూ ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని సూచించారు.

ముగిసిన శిక్షణ



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఫౌండేషన్ అధినేత వెంకటేశ్వరరావు, తదితరులు

గోకవరం: గ్రామంలో కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత మగ్గంవర్క్ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. రాజానగరానికి చెందిన డాక్టర్ వినయ్‌సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 40 మంది మహిళలకు ఉచితంగా మగ్గం వర్క్‌పై శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా శుక్రవారం శిక్షణ పొందిన మహిళలకు స్థానిక నాయకుడు దాసరి రాధాకృష్ణ, డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మగ్గంవర్క్‌కు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో తమ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా శిక్షణ ఇచ్చామన్నారు. మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ప్రియాంక, గంగ, బుజ్జి, వరలక్ష్మి, భవాని, కిరణ్‌సౌమ్య, నాగమణి, మీనా, పూర్ణిమ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు 1,116 అరిసెల నివేదన



దేవీచౌక్ ఆలయం వద్ద భక్తులకు అరిసెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మకు శుక్రవారం 1,116 అరిసెలు నివేదించారు. ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథ శర్మ, వల్లూరి శ్రీనివాస్‌శర్మ ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు అమ్మవారికి 1,116 అరిసెలు సమర్పించగా వాటిని అర్చకులు అమ్మవారికి నివేదించి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.

లంగరు తాడు తెగి బోటు ధ్వంసం



రాళ్ల గోడను ఢీ కొట్టిన బోటు

కొత్తపల్లి: ఉప్పటేరులో లంగర్ వేసిన బోటు తాడు తెగి రాళ్ల గోడను ఢీకొట్టడంతో శుక్రవారం బోటు ధ్వంసం అయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉప్పాడ శివారు నాయకర్ కాలనీకి చెందిన ఉమ్మిడి జగన్నాథం వేట నిషేధం కావడంతో రామన్నపాలేం వద్ద ఉన్న బోటుకు లంగర్ వేశాడు. కొద్ది రోజులుగా కెరటాల ఉధృతి కారణంగా లంగర్ తాడు తెగి బోటు రాళ్ల గోడను ఢీకొట్టింది. దీంతో బోటు అడుగు భాగం పూర్తిగా ధ్వంసమై సుమారు రూ. 4లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు తెలిపాడు. 2006 సంవత్సరంలో కూడా వేట నిషేధ సమయంలో లంగర్ వేసిన బోటు తాడు తెగి ధ్వంసం అయినట్టు జగన్నాథం ఆవేదన వ్యక్తం చేశాడు.